నమస్తే తెలంగాణ
# కరీంనగర్
5 కరీంనగర్, మంగళవారం 25 జూన్ 2024 KARIMNAGAR



# కాంగ్రెస్‌లో కల్లోలం

**బీఆర్ఎస్ ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ చేరికతో అసంతృప్తి జ్వాల**

**కనీస సమాచారం ఇవ్వకపోవడంపై ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కినుక**

**తన పదవికి రాజీనామా చేసేందుకు సిద్ధం!**

- రేవంత్‌రెడ్డిపై జగిత్యాల పార్టీ శ్రేణుల నిరసన
- తాడో పేడో తేల్చుకోవాలంటున్న కార్యకర్తలు
- సమావేశమైన విప్‌లు అడ్లూరి, ఆది
- వెనక్కి తగ్గకపోవడంతో రంగంలోకి దిగిన మంత్రులు
- సాయంత్రం శ్రీధర్‌బాబు ఎదుట జీవన్‌రెడ్డి ఆగ్రహం
- సీఎంతో మాట్లాడేందుకు నిరాకరణ

కాంగ్రెస్‌లో కల్లోలం మొదలైంది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరు సంజయ్‌కుమార్ చేరికపై తీవ్ర నిరసన వెల్లువెత్తుతున్నది. నిన్నటి వరకు పార్టీని, ప్రభుత్వాన్ని, ముఖ్యంగా ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిపై తీవ్ర విమర్శలు చేస్తూ.. జగిత్యాలలో కార్యకర్తలు, నాయకులను ఇబ్బందులకు గురిచేసిన సంజయ్‌ను ఆదివారం రాత్రి సీఎం రేవంత్‌రెడ్డి తన సమక్షంలో చేర్చుకోవడంతో చిచ్చు రేగింది. పదేళ్లు రాజకీయ ప్రత్యర్థిగా ఉన్న వ్యక్తిని, ఎంపీ ఎన్నికల సమయంలో బీజేపీ అభ్యర్థికి మద్దతు పలికి తన ఓటమికి కారణమైన ఆయనను మాటమాత్రం చెప్పకుండా పార్టీలోకి ఎలా తీసుకుంటారంటూ సీనియర్ నాయకుడు, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆగ్రహిస్తుండడం పార్టీలో అలజడి రేపుతున్నది. మరోవైపు ఇక తాడోపేడో తేల్చుకుందామంటూ కార్యకర్తలు, నాయకులు స్పష్టం చేస్తుండగా.. వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. అయితే, పార్టీలో సీనియర్ నాయకుడు ఉన్న జగిత్యాల కోటాలో మరో ఎమ్మెల్యేను ఎందుకు చేర్చుకోవాల్సి వచ్చిందన్న దానిపై శ్రేణుల్లో అనేక అనుమానాలు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా జీవన్‌రెడ్డిని వదిలించుకునే దిశగా అధిష్టానం అడుగులు వేసిందా..? లేక ఆయన ఉంటే తమ పప్పులు ఉడకవన్న భావనతో ఉమ్మడి జిల్లా నాయకత్వం ఏమైనా కుట్రలకు పూనుకున్నదా..? అందులో భాగంగానే సంజయ్‌ను చేర్చుకున్నారా..? ఇలా అనేక ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

జగిత్యాల, జూన్ 24, (నమస్తే తెలంగాణ) : జగిత్యాల బీఆర్ఎస్ ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరు సంజయ్ కుమార్ చేరికపై సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి హతాశులయ్యారు. రాజకీయాల్లో సీనియర్ అన్న గౌరవం లేకుండా, కనీసం తనకు మాటమాత్రం చెప్పకుండా తన ప్రత్యర్థిని చేర్చుకోవడంపై తీవ్ర అసంతృప్తి చెందారు. తనను, తన క్యాడర్‌ను అవమానపర్చారంటూ మండిపడుతున్నారు. సోమవారం ఉదయం పెద్ద సంఖ్యలో తరలివచ్చిన కార్యకర్తల ఎదుట తన ఆవేదనను వెల్లగక్కారు. నాలుగు దశాబ్దాలుగా పార్టీకి సేవలందించానని, ప్రతిపక్ష పార్టీలకు దీటుగా స్పందించి పోరాడానని, పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు 40 మంది సభ్యుల మండలిలో తానొక్కడినే కాంగ్రెస్ ఎమ్మెల్సీగా పోరాటం చేశానని గుర్తు చేశారు. అయినా, తనకు కనీస మర్యాద ఇవ్వలేదని ఆవేదనకు గురయ్యారు. ఈ క్రమంలో ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తానని ఆయన కార్యకర్తలకు స్పష్టం చేయడంతోపాటు మీడియాకు సైతం సమాచారం అందించారు. అలాగే, ఈ విషయాన్ని అధిష్టానంతోపాటు పెద్దల దృష్టికి తీసుకువెళ్లేందుకు సిద్ధమైనట్టు సమాచారం. రాష్ట్ర ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీకి ఫిర్యాదు చేయడంతోపాటు ఇతర కీలక నాయకుల దృష్టికి కూడా తీసుకెళ్లాలని భావిస్తున్నట్టు తెలుస్తున్నది.

## తాడోపేడో తేల్చుకుందామన్న శ్రేణులు

సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం రాత్రి సంజయ్ కుమార్‌ను కాంగ్రెస్‌లో చేర్చుకోవడంపై ఆ పార్టీ కార్యకర్తలు, నాయకులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రేవంత్‌రెడ్డి ధోరణి ఏమాత్రం సరికాదని, ఆయన స్వలాభం కోసం అవకాశావాద రాజకీయాలు చేస్తున్నాడని, పార్టీ కోసం దశాబ్దాలుగా కష్టపడుతున్న వారికి అన్యాయం చేస్తున్నాడంటూ ధ్వజమెత్తారు. సోమవారం ఉదయమే ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పెద్దసంఖ్యలో తరలివచ్చి ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలపై ఎప్పుడూ విషం చిమ్ముతూ, వారిపై కక్ష సాధించిన ఎమ్మెల్యే సంజయ్‌తో కలిసి ఎలా పనిచేస్తాం? అంటూ తమ ఆవేదనను వ్యక్తం చేశారు. 'మాటమాత్రం చెప్పకుండా ఎలా నిర్ణయం తీసుకుంటారు సార్? మనం అంటే అంత అలుసా..? అసలు రేవంత్‌రెడ్డి ఎవరు? పార్టీని నాశనం చేసే హక్కు ఆయనకెవరు ఇచ్చారు?' అంటూ మండిపడ్డారు. 'గాంధీ భవన్ వెళ్దాం. అవసరమైతే గాంధీభవనన్‌పై దాడి చేద్దాం' అంటూ ఆగ్రహంగా ఊగిపోయారు. రేవంత్‌రెడ్డి వద్దకు వెళ్దామని, అవసరమైతే తాడోపేడో తేల్చుకుందామని విన్నవించారు. మల్లాపూర్ మండలం ముత్యంపేటకు చెందిన రాష్ట్ర కిసాన్ సెల్ కో–ఆర్డినేటర్ వాకిటి సత్యంరెడ్డి తన పదవికి రాజీనామా చేశారు. రాజీనామా పత్రాన్ని ప్యాక్స్ ద్వారా సీఎం రేవంత్‌రెడ్డి, కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేశ్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు, విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు పంపించినట్టు చెప్పారు.

## జీవన్‌రెడ్డితో విప్‌ల భేటీ

జగిత్యాలలో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో ఆ పార్టీ సీనియర్లు రంగంలోకి దిగారు. రాజీనామా చేసేందుకు సిద్ధమైన జీవన్‌రెడ్డిని బుజ్జగించే ప్రయత్నం ప్రారంభించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఫోన్ చేసి, తొందరపడి నిర్ణయం తీసుకోవద్దని, ఈ విషయాన్ని అధిష్టానం దృష్టికి తీసుకెళ్తామని నచ్చచెప్పేందుకు ప్రయత్నించినా జీవన్‌రెడ్డి ససేమిరా అన్నట్టు తెలిసింది. ఇటు అధిష్టానం ఆదేశాలతో జగిత్యాల జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హుటాహుటిన జగిత్యాలకు చేరుకొని, జీవన్‌రెడ్డి ఇంట్లో భేటీ అయ్యారు. అయితే ప్రభుత్వ తీరు, పార్టీ వ్యవహారంపై సీఎం రేవంత్‌రెడ్డి నిర్లక్ష్యపూరిత, అవకాశవాద రాజకీయాలపై తీవ్ర అసహనం వ్యక్తం చేసినట్టు తెలిసింది. నలభై ఏండ్లుగా పార్టీని నమ్ముకొని, కార్యకర్తలను కాపాడుకుంటూ పనిచేస్తే బిహేవ్ చేసేది ఇలాగేనా..? అని ప్రశ్నించినట్టు సమాచారం. ఈ భేటీ సందర్భంలో సీనియర్ నాయకులు, కార్యకర్తలు, జీవన్‌రెడ్డి కుటుంబ సభ్యులు సైతం పార్టీ విధానాలపై, రేవంత్‌రెడ్డి వ్యవహారశైలిపై ఆగ్రహం వ్యక్తం చేసినట్టు సమాచారం. ఆది శ్రీనివాస్, లక్ష్మణ్‌కుమార్ నచ్చచెప్పేందుకు ప్రయత్నించినా, జీవన్‌రెడ్డి మాత్రం మెట్టు దిగిరాలేదని, రాజీనామా లేఖను సైతం సిద్ధం చేసుకున్నట్టు తెలుస్తున్నది. ఈ క్రమంలోనే సమస్య తీవ్రంగా ఉందని, జీవన్‌రెడ్డిని తాము హ్యాండిల్ చేయలేకపోతున్నామని, కార్యకర్తలు, నాయకులు ఆగ్రహంగా ఉన్నారని, అవసరమైతే దాడి చేసే పరిస్థితి ఉందన్న అభిప్రాయానికి వచ్చి, ఈ విషయాన్ని అధిష్టానంతోపాటు సీనియర్లకు చెప్పడంతో రంగంలోకి మంత్రులు, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌ను దింపినట్టు సమాచారం.

## శ్రీధర్‌బాబు ఎదుట ఆగ్రహం

సాయంత్రం జీవన్‌రెడ్డి ఇంటికి వచ్చిన మంత్రి శ్రీధర్‌బాబు ఎదుట ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. 'డబుల్ బెడ్రూం ఇండ్లకు సంబంధించి ₹200 కోట్ల నిధులు ఇచ్చి కండువా కప్పడం అవసరమా..? పదేండ్లపాటు మనకు వ్యతిరేకంగా ఉన్న వ్యక్తిని పార్టీలోకి తీసుకుంటారా..? ఇదేనా పద్ధతి? నా సీనియారిటి, సిన్సియార్టీకి ఇచ్చే విలువ ఇదేనా..? కార్యకర్తల కష్టాలు, మనోభావాలు అక్కర లేదా..?' అంటూ తీవ్రంగా ప్రశ్నించినట్టు సమాచారం. ఈ క్రమంలో మంత్రి శ్రీధర్‌బాబు రెండు సార్లు సీఎం రేవంత్‌రెడ్డితో 'ఫోన్‌లో మాట్లాడండి' అంటూ కోరినా, జీవన్‌రెడ్డి మాత్రం తాను మాట్లాడనని తిరస్కరించినట్టు తెలిసింది. మంత్రి శ్రీధర్‌బాబు వెళ్లిన తర్వాత కూడా 'రాజీనామాకే కట్టుబడి ఉన్నాను' అని సన్నిహితులతో చెప్పినట్టు సమాచారం. మంగళవారం హైదరాబాద్ వెళ్లి సీనియర్లతో, అధిష్టానంతో మాట్లాడేందుకు జీవన్‌రెడ్డి సిద్ధమైనట్టు తెలుస్తున్నది. పరిస్థితులు ఎలా ఉన్నా.. అధికారం ఉన్నా, లేకపోయినా కార్యకర్తలు తన వెంట ఉన్నారని, వారి మనోభావాలకు అనుగుణంగా తన భవిష్యత్ కార్యాచరణ ఉంటుందని జీవన్‌రెడ్డి విలేకరులతో స్పష్టం చేశారు.

## బీజేపీలో చేర్చుకునే ప్రయత్నం?

జీవన్‌రెడ్డి నిరాశలో కూరుకుపోయిన విషయాన్ని గుర్తించిన బీజేపీ, ఆయనను పార్టీలోకి ఆహ్వానించేందుకు ప్రయత్నిస్తున్నట్టు సమాచారం. బీఆర్ఎస్ ఎమ్మెల్యే కాంగ్రెస్‌లో చేరడం, కాంగ్రెస్ శ్రేణులు, కార్యకర్తలు, జీవన్‌రెడ్డి అందరూ దీన్ని వ్యతిరేకించడంతో పరిస్థితిని తమకు అనుకూలంగా మార్చుకోవాలని భావిస్తున్నట్టు తెలుస్తున్నది. అందులో భాగంగానే జీవన్‌రెడ్డికి మొదటి నుంచి ఆప్తుడిగా పేరున్న ఈటల రాజేందర్, కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్‌ను రంగంలోకి దింపి జీవన్‌రెడ్డిని కలిసి ఒప్పించాలని సూచించినట్టు సమాచారం. దీంతో వారు రంగంలోకి దిగి జీవన్‌రెడ్డికి టచ్‌లోకి వెళ్లినట్లు తెలుస్తున్నది.



సిరిసిల్ల టౌన్ : డాక్టర్ సంజయ్ కుమార్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న విద్యార్థి విభాగం నాయకులు

# నమ్మకద్రోహంపై ఆగ్రహజ్వాల

**సంజయ్.. డౌన్ డౌన్**

**ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పార్టీ వీడడంపై భగ్గుమన్న బీఆర్ఎస్ శ్రేణులు**

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిరసనలు, దిష్టిబొమ్మల దహనాలు
- జగిత్యాలలో ఎమ్మెల్యే ఇంటి ముట్టడి.. దవాఖాన ఎదుట ఆందోళన
- ముమ్మాటికీ నమ్మకద్రోహమేనని ధ్వజం

జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ పార్టీని వీడడంపై బీఆర్ఎస్ భగ్గుమన్నది. తల్లిపాలు తాగి రొమ్మునే గుద్దినట్టు.. ఇన్నేళ్లు పదవులన్నీ అనుభవించి ఇప్పుడు స్వార్థం కోసం పార్టీ మారాడంటూ గులాబీదళం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఉద్యమంలో లేకున్నా అధినేత కేసీఆర్ గొప్ప మనసుతో టికెట్ ఇస్తే.. అవకాశవాదంతో జంప్ అయ్యాడని ధ్వజమెత్తింది. ఈ మేరకు సోమవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిరసనలు తెలిపింది. పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు జిల్లాకేంద్రాలతోపాటు మండల కేంద్రాల్లో సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేసి, ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జగిత్యాలలోని ఎమ్మెల్యే ఇంటిని ముట్టడించడంతో పాటు ఆయన దవాఖాన ఎదుట ఆందోళన చేశారు. 'చెట్టు మీది కొంగ.. సంజయ్‌కుమార్ దొంగ', 'ఎమ్మెల్యే సంజయ్ రాజీనామా చేయాలి' అని ప్లకార్డులు పట్టుకుని నిరసన తెలిపారు.



జగిత్యాల : ఎమ్మెల్యే దవాఖాన ఎదుట ప్లకార్డులు పట్టుకుని నినదిస్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, నాయకులు





## నమ్మక ద్రోహానికి ప్రతిరూపం

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సంజయ్‌కుమార్‌కు మూడుసార్లు టికెట్ ఇప్పించారు. ఒక చంటి పిల్లాడిలా పట్టుకుని కాలికి బట్ట కట్టకుండా తిరిగి రెండుసార్లు గెలిపించారు. కానీ, అవేమీ ఆయనకు గుర్తుకురాలేదు. నమ్మక ద్రోహానికి ఒక ప్రతిరూపం ఎమ్మెల్యే సంజయ్ కుమార్. రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలువడం బీఆర్ఎస్ భిక్ష. పార్టీ గుర్తుతో గెలిచి, మరో పార్టీలో చేరడం రాజ్యాంగ విరుద్ధం. ఈ విషయాన్ని బీఆర్ఎస్ పార్టీ శ్రేణులతోపాటు సామాన్య ప్రజలు చెబుతున్నరు. తమ ఓటు వృథా అయిందని స్వచ్ఛందంగా వచ్చి తీవ్రంగా ఖండిచిన్రు.

**- జగిత్యాలలో జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేశ్**

## తల్లిపాలు తాగి రొమ్ము మీద గుద్దిండు

ఉద్యమంలో పాల్గొనకున్నా సంజయ్‌కుమార్‌ను కేసీఆర్ పిలిచి మూడు సార్లు టికెట్ ఇచ్చిండు. కానీ, సంజయ్ తల్లి పాలు తాగి రొమ్ము మీద గుద్దిండు. ఆయన వెంటనే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలి. ఆయన ఒకసారి ఓడినా మరో రెండు సార్లు గెలువడానికి ఎమ్మెల్సీ కవిత ఎంతో కృషి చేశారు. ఇప్పుడు సంజయ్ బీఆర్ఎస్‌కు నమ్మక ద్రోహం చేసిండు.

**- జగిత్యాలలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు**

కరీంనగర్ కార్పొరేషన్/ జగిత్యాల, జూన్ 24 : జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరడంపై గులాబీ శ్రేణులు భగ్గుమన్నాయి. ఆయనకు వ్యతిరేకంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిరసనలు చేపట్టాయి. మరోవైపు ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న జగిత్యాలలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి పార్టీ జిల్లా కార్యాలయంలో సమావేశమై కార్యకర్తల్లో స్థైర్యం నింపారు. అనంతరం స్థానిక తహసీల్ చౌరస్తా వద్ద ధర్నా చేపట్టారు. కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యే దిష్టి బొమ్మను తగలబెట్టారు. తర్వాత సంజయ్‌కుమార్ ఇంటిని, దవాఖానను ముట్టడించారు. మెట్‌పల్లిలోని పాత బస్టాండ్ వద్ద జగిత్యాల ఎమ్మెల్యే దిష్టిబొమ్మను దహనం చేశారు. దీంతో జిల్లాలోని అన్ని మండలాల్లో ఎమ్మెల్యే దిష్టిబొమ్మలను దహనం చేసి, నిరసనలు తెలిపారు. అలాగే కరీంనగర్‌లోని తెలంగాణ చౌక్‌లో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు ఆధ్వర్యంలో నాయకులు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ దిష్టిబొమ్మను దహనం చేసే ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో బీఆర్ఎస్ నాయకులు, పోలీసుల మధ్య కొద్ది సేపు తోపులాట జరిగింది. అనంతరం బీఆర్ఎస్ నాయకులు సంజయ్‌కుమార్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కరీంనగర్ జిల్లాలోని అన్ని మండలాల్లో సంజయ్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంతోపాటు అన్ని మండలాల్లో ఎమ్మెల్యే సంజయ్ దిష్టిబొమ్మలను దహనం చేసి, నిరసనలు తెలిపారు. పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్‌లో ఎమ్మెల్యే దిష్టిబొమ్మను దహనం చేసి, ఆయనకు వ్యతిరేకంగా నినదించారు. అనంతరం ప్రజాస్వామ్యాన్ని కాపాడాలంటూ అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు.



జగిత్యాలలో ర్యాలీగా వస్తున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

## జగిత్యాలలో తిరగనివ్వం

కష్ట కాలంలో ఉన్న పార్టీకి మోసం చేసి స్వార్థంతో కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్‌ను జగిత్యాలలో తిరుగనివ్వం. అలాంటి వారు బతికున్నా చచ్చిన శవంతో సమానం. పార్టీలో ఆయనకు అత్యున్నత స్థానం ఇచ్చాం. నియోజకవర్గంలో చాలా అభివృద్ధి పనులకు కేసీఆర్ నిధులు అందించారు. కానీ, వాటినన్నింటినీ తిరస్కరించి కాంగ్రెస్‌లో చేరడం విడ్డూరంగా ఉన్నది. డాక్టర్ సంజయ్ కుమార్‌కు టికెట్ ఇచ్చి గెలిపిస్తే స్వలాభం కోసం కాంగ్రెస్‌లో చేరడం సరికాదు. ఆత్మహత్యకన్నా హీనమైన చర్య. నీతి, నిజాయితీ, తెలంగాణ పౌరుషం ఉంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి మళ్లీ పోటీలో నిలువాలి. కేవలం స్వార్థం కోసమే కాంగ్రెస్‌లో చేరారని, ప్రజల్లోకి వెళ్తే ఆయనకు నిరాశ తప్పదు.

**- జగిత్యాలలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్**

## దమ్ముంటే రాజీనామా చేసి పోటీ చెయ్

బీఆర్ఎస్ పార్టీ కారు గుర్తుపై గెలిచిన సంజయ్‌కుమార్‌కు నిజంగా దమ్ము, ధైర్యం ఉంటే రాజీనామా చేసి మళ్లీ పోటీ చేయాలి. 2014, 2018, 2023లో ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం ఇచ్చిన కేసీఆర్‌కు వెన్నుపోటు పొడిచిండు. ఇన్నేళ్లు అన్ని రకాల పదవులు అనుభవించి కాంగ్రెస్‌లో చేరిండు. ఇలా చేయడం దురదృష్టకరం.

**- జగిత్యాలలో చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్**



తిమ్మాపూర్ : అలుగునూర్ చౌరస్తాలో ఎమ్మెల్యే సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేసి నినాదాలు చేస్తున్న నాయకులు



కరీంనగర్ : తెలంగాణ చౌక్‌లో దిష్టిబొమ్మను దహనం చేయకుండా బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు



జగిత్యాలలో ప్లకార్డులతో నినదిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

# నమ్మి పట్టం కడితే ద్రోహం చేస్తారా?

**నా ప్రాణం ఉన్నంత వరకు బీఆర్ఎస్‌లోనే.. • కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల**

కోరుట్ల, జూన్ 24: ' నా ప్రాణం ఉన్నంత వరకూ బీఆర్ఎస్‌లోనే కొనసాగుతా. బిల్లులు, డబ్బుల కోసం పార్టీ వీడే నాయకుడిని నేను కాదు. ప్రజలకు ఆకాంక్షలకు అనుగుణంగా పని చేసే నాయకుడిని' అని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల స్పష్టం చేశారు. ప్రజలు నమ్మి ఎమ్మెల్యేగా పట్టం కడితే ద్రోహం చేస్తారా..? అని డాక్టర్ సంజయ్ కుమార్‌పై మండిపడ్డారు. బీఆర్ఎస్‌లో ఉన్నత పదవులు అనుభవించిన బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి పార్టీని వీడడం బాధ కలిగించిందన్నారు. పార్టీ మారిన ఇద్దరు వయసులో పెద్దోళ్లు, బుద్ధిలో సన్నాసులుగా మారారని ఎద్దేవా చేశారు. కోరుట్ల పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. సంజయ్ బిల్లులు, డబ్బులకు ఆశపడి దొంగచాటుగా కాంగ్రెస్‌లో చేరారని ఆరోపించారు. సంజయ్‌ని తన గురువుగా భావించానని, ఇప్పుడు ఆయనను చూసి సిగ్గుపడుతున్నట్టు చెప్పారు. బీఆర్ఎస్‌కు 60 లక్షల సభ్యత్వం కలిగిన కార్యకర్తలు ఉన్నారని, పార్టీని చీల్చే దమ్ము ఎవరికి లేదన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు అన్నం అనిల్, మండలాధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్, నాయకులు దశరథరెడ్డి, ఫహీమ్, జిందం లక్ష్మీనారాయణ, బట్టు సునీల్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల

ద్వాదశ దినకర్మ



కీ.శే. రేగూరి మణెమ్మ గారు
మరణం: 14-06-2024 శుక్రవారం
ప్రేమా, ఆప్యాయత, అనురాగాలతో మా అందరికి ఆదర్శప్రాయంగా నిలిచిన మీరు.. మా నుండి భౌతికంగా దూరమైనా.. మీ మధుర స్మృతులు మా మదిలో మెదులుతూనే ఉంటాయి. మీ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని కోరుకుంటూ....
తేది: 26-06-2024 బుధవారం రోజున పెద్దకర్మ జరుపబడును.
కావున తామెల్లరూ విచ్చేసి వారి ఆత్మకు శాంతి చేకూర్చగలరని మనవి.
కార్యస్థలం: KSL UTSAV BANQUET HALL
ఎన్.టి.ఆర్. విగ్రహం దగ్గర, కరీంనగర్
సహపంక్తి భోజనం మ॥ గం॥ 12.45 ని॥లకు
భర్త: రేగూరి రాజేశం
కుమారులు-కోడళ్ళు: రేగూరి ఆంజనేయులు-సరిత, రేగూరి లక్ష్మణ్-మాలతి
మరియు కుమార్తెలు, అల్లుండ్లు, మనుమలు, మనుమరాండ్లు
భవాని ఫీడ్స్
భవాని వెటర్నరీ మెడికల్ హాల్
సాయి క్రిష్ణ పౌల్ట్రీ ఇండస్ట్రీస్
వెంకటేశ్వర మార్కెటింగ్
నోట్: ఈ ప్రకటననే కార్డుగా భావించి రాగలరు.

• జన్మదిన శుభాకాంక్షలు
• పొలిటికల్
• స్వదేశాగమనం
• లీగల్ ప్రకటనలు
• క్లాసిఫైడ్స్
• పదవీ విరమణ
• ప్రారంభోత్సవం
• శ్రద్ధాంజలి
• సినిమా
• వివాహ మహోత్సవం
• షష్టిపూర్తి మహోత్సవం మరియు
• అన్ని శుభకార్యాలు

నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..
ప్రకటనల విభాగం...
సెల్: 9182 777 571